విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 17, సెప్టెంబరు 2024

దాడులు చేయడం మంచి పద్ధతి కాదు
- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్

విశాలాంధ్ర-నంద్యాల నంద్యాలలో తనపై జరిగిన దాడి యత్నం సంఘటన దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలను మా కుటుంబం కాని, పట్టణ ప్రజలు కానీ సహించరని రాష్ట్ర మంత్రి ఫరూక్ తనయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. సోమవారం రాజ్ థియేటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ జనసేన అధినేత డిప్యూటీ సీఎం జన్మ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో టిడిపిలోని మరో వర్గానికి చెందిన నాయకుడి ఫొటో లేదని తనకు పదేపదే ఫోన్‌చేస్తూ బెదిరింపులకు దిగారని తెలిపారు. ఆఫీస్ నుండి సాయంత్రం తాను బయటకు వెళ్తుండగా ఎంఆర్ అనే వ్యక్తి వాహనాన్ని ఆపి దాడికి ప్రయత్నించగా అక్కడున్న తమ అనుచరులు అడ్డుకున్నారన్నారు. ప్రశాంత వాతావరణం కలిగిన నంద్యాలలో ఇలాంటి సంఘటనలకు తావు లేదని, సంబంధం లేని విషయాల్లోకి నన్ను లాగొద్దని అన్నారు. ఏమైన ఉంటే ఆఫీస్ వద్దకు రమ్మన్నానని, ఫ్లెక్సీలో నాయకుడి ఫొటో లేకుంటే నాకు సంబంధమేంటని, అది టీడీపీ కార్యక్రమం కూడా కాదన్నారు. జనసేనకు సంబంధించిన కార్యక్రమం.. వాళ్ళ నాయకుడి ఫొటో ఫ్లెక్సీలో లేకుంటే నాపై దాడి చేస్తారా అని ఫిరోజ్ ప్రశ్నించారు. రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని నంద్యాల ప్రజలు ప్రోత్సహించ రని పేర్కొన్నారు. దాడి చేసిన వారిని పోలీసులు పట్టుకొని విచారిస్తున్నారని తెలిపారు.

సేవా భావం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-అవుకు : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని తెలుగుదేశం నాయకుడు ఆకుల నాగిరెడ్డి అన్నారు. ఇప్పటివరకు కొండమీది గ్రామాలైన కొండమ నాయుని పల్లి, జూనూతల, ఉప్పలపాడు, కునుకుంట్ల, మారేమడుగుల, ఇస్రా నాయక్ తండ, మన్నే నాయక తండా, మర్రికుంట తండా గ్రామాలలోని ప్రజలు ఎవరైనా చనిపోతే ఫ్రీజర్ బాక్స్ లేక ఇబ్బందులను ఎదుర్కొనే వారని అన్నారు. ఫ్రీజర్ బాక్స్ కోసం అటు అవుకు గాని,ఇటు కొలిమిగుండ్లకు గాని పోవాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. ఈ గ్రామల ప్రజల అవసరాల కోసం రూ.80 వేల సొంత నిధులను వెచ్చించి బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను చేయించానని, ఫ్రీజర్ బాక్స్ ను ఉంచడం కోసం 20 వేల రూపాయలతో ఒక షెడ్డును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉచిత ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన ఆకుల నాగిరెడ్డికి స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో వెంకట శివారెడ్డి,ఆకుల విశ్వనాథరెడ్డి,బోరు శివారెడ్డి, శివయ్య, హనుమానాయక్, బాల సుంకన్న, శ్రీరాముల యాదవ్, జూనూతల వెంకటేష్, మండ్ల వెంకటేష్,లక్ష్మన్న, వేలు నాయక్,జంగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయం

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలో గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డా.పి దస్తగిరిరెడ్డి సారథ్యంలో శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్, గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంయుక్త నిర్వహణలో విజయవాడ వరద బాధితులకు మంగళవారం సహాయం అందజేసినట్లు చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో వరద బాధిత కుటుంబానికి 10 కేజీల బియ్యం చొప్పున 1000 కుటుంబాలకు తమ సంస్థల సిబ్బంది పంపిణీ చేస్తారని, రూ.2.50 లక్షల నగదును చెక్కు రూపంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో వరద బాధితులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గురు రాఘవేంద్ర విద్యా సంస్థ డైరెక్టర్లు పి.మౌలాలిరెడ్డి, పి.షేక్షావలి రెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, డాక్టర్ జి.రవికృష్ణ, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండల పరిధిలోని కోవెలకుంట్ల జమ్మలమడుగు ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీల్లో భాగంగా రాయల్టీ లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు రెడ్డి సోమవారం తెలిపారు. జమ్మలమడుగు నుండి కోవెలకుంట్ల పట్టణానికి తరలి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ను అల్లూరు గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనానికి సంబంధించి రికార్డులు లేకపోవడం, ఇసుకకు సంబంధించిన రాయల్టీ లేకపోవడంతో డ్రైవర్ సుధాకర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్పష్టం చేశారు.

నేటి నుండి బిజినవేములలో చౌడేశ్వరి దేవి జ్యోతులు..

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామంలో మంగళవారం నుండి చౌడేశ్వరిదేవి జ్యోతుల మహెూన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీడీపీ నాయకులు భక్త ప్రహల్లాదరెడ్డి, జి.ఉషెనయ్య సోమవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. భక్త ప్రహ్లాద మాట్లాడుతూ చౌడేశ్వరిదేవి జ్యోతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్లు భవనాల శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ, మంత్రి సోదరులు రాజారెడ్డి, రామ్నాథ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా మహాలయ పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి జ్యోతుల కార్యక్రమం ప్రారంభమం అవుతుందని భక్తులు ఆలయానికి చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

50 శాతం సబ్సిడీతో రైతులకు పరికరాలు అందించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20వేలు చెల్లించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

మాట్లాడుతున్న రంగనాయుడు

విశాలాంధ్ర రుద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రైతులకు 50 శాతం సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పరికరాలను అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దకమ్మలూరు గ్రామంలో గ్రామ శాఖ సమావేశం కార్యదర్శి ఎన్ రామాచారి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ప్రత్యేక అతిథిగా హైకోర్టు సీనియర్ న్యాయవాది ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఆళ్లగడ్డ కార్యదర్శి కే.భాస్కర్ రుద్రవరం మండల కార్యదర్శి బాల నరసింహుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చినటువంటి వాగ్దానాలను కచ్చితంగా అమలు చేయాలని, రైతులకు ఇచ్చిన ఆసరా కింద 20000 రూపాయలు ,సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి జీఎస్టీ పరిధిలోకి తేవాలని రైతులకు 50 శాతం సబ్సిడీతో డీజిల్ అందించాలని వ్యవసాయ పరికరాల అందిం చాలని, పెట్టుబడి సాయం కింద ప్రతి సన్న చిన్న కారు రైతులకు ఎకరానికి 20వేల రూపాయలు పెట్టుబడి సాయం ఇవ్వాలని, కౌలు రైతులకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి బడ్జెట్లో వారికి నిధులు కేటాయించి ఎలాంటిపూచి లేకుండా రెండు లక్షల వరకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా అందించి రుణ బాధల నుంచి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు వెంకటేశ్వర్లు, నాగ నరసింహుడు, బాల నరసింహుడు, రామచంద్రుడు, కిలిమెంట్, పావని, సరస్వతి, జయమ్మ పలువురు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి..

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.సుంకయ్య

విశాలాంధ్ర-డోన్.. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ ఆలోచన విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి లేదంటే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ పి.సుంకయ్య అన్నారు. సోమవారం డోన్ పట్టణం లోని నక్కి రామన్న భవనంలో విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు గుప్పెట్లోకి తీసుకెళ్లే ఆలోచన కనిపిస్తున్నాయని, గుజరాత్ తరహా బీజేపీ ప్రభుత్వం ప్రవేటు భాగస్వామ్యం విధానానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్న దన్నారు. దీనిపై వైద్య విద్యార్థులు కలవరం చెందుతు న్నారని, ఇదే జరిగితే మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థకు తూట్లు పడే ప్రమాదం ఉందన్నారు. వైద్య విద్య పూర్తిగా ప్రైవేటు పరంగా మారుతుందని, ప్రభుత్వ ఆసు పత్రిలు ప్రైవేటు గుప్పె ట్లోకి వెళ్లి సామాన్యులకు వైద్యం దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య కళాశాలను అపోలో వైద్య కళాశాలకు కట్టబెడుతూ ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చి 37 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడంపైన నిరసనలు వెల్లువెత్తాయన్నారు గుజరాత్‌లో మొత్తం 37 వైద్య కళాశాల ఉండగా అందులో ఆరు ప్రభుత్వ వైద్య కళాశాల ఉన్నా యని, తాజాగా చంద్రబాబు ప్రభుత్వం గుజరాత్ బిజెపి ప్రభుత్వం మాదిరిగా విధానాలపై మొగ్గు చూపుతు న్నట్లు తెలుస్తున్నదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో తీసుకువచ్చిన ఐదు నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో మిగిలిన ప్రభుత్వ వైద్య కళాశాల కలిపి మొత్తం పిపిపి విధానంలోకి వెళ్లి పోయయన్నారు. ఈ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల హామీకి విరుద్ధంగా ప్రైవేట్‌పరం చేయాలని ఆలోచనకు తెరతీయడంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బి.నారాయణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వరదరాజులు పాల్గొన్నారు.

ఫిరోజ్‌పై దాడి పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యానికి నిదర్శనం - సిపిఐ నేతలు

విశాలాంధ్ర నంద్యాల అర్బన్: నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తనయుడు ఎన్ఎండి ఫిరోజ్ పై దాడి పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ఆరోపించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే. ప్రసాద్ లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎన్ ఎండి ఫిరోజ్ కాన్వాయ్ పై ఆదివారం రాత్రి దుండగులు దాడి చేయడం హేయమైన చర్యని ఫిరోజ్ పై దాడి చేసిన దుండగులపై పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దాడిని సిపిఐ పార్టీగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రం అయినప్పటి నుండి పట్టణ పరిసర ప్రాంతాలలో పదుల సంఖ్యలో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జరుగుతున్న వాటిపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టకపోవడంతో న్యాయశాఖ మంత్రి కుమారునికి రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ పట్టణంలో పలు వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశలో ముందుకు పోతుంటే ఓర్వలేని వారు ఇలాంటి దాడులకు తెగబడడం దుర్మార్గమైన చర్యని పార్టీలో అంతర్గత సమస్యలుంటే రాష్ట్ర పార్టీ నాయకత్వంలో చర్చించాలి తప్ప ఇలాంటి దాడులకు పూనుకోవడం విచారకరమని అన్నారు. జిల్లా పోలీసు అధికారులు ట్రాఫిక్ నిబంధనలంటూ రోడ్డుపైన జీవిస్తున్న వ్యాపారస్తులను, ఆటో కార్మికులను, వేధించడమే తప్ప పట్టణంలో అనేక ప్రాంతాలలో నాటు సారాయి, గంజాయి, మట్కా, రౌడీ షీటర్ల దౌర్జన్యాలు, అసాంఘిక కార్యక్రమాలు కొనసాగు తున్న వాటిని నియంత్రించడంలో వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ అధికారులు నంద్యాల జిల్లాలో భయ బ్రాంతులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టి జిల్లాలో ప్రశాంత వాతావరణ నెలకొల్పి ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూసేందుకు కృషి చేయాలని పోలీసులను వారు కోరారు.

రేషన్ బియ్యం.. పేదలకు అందని ద్రాక్షలా మారింది
- సీపీఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్

విశాలాంధ్ర నంద్యాల అర్బన్: పట్టణంలో కొన్ని వార్డులలో రేషన్ బియ్యం అందక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో పట్టణంలోని వార్డులలో వాహనాలలో తిరుగుతూ ప్రజల దగ్గరికి వచ్చి రేషన్ పంపిణీ చేసే వారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల అయ్యేసరికి పేద ప్రజలు రేషన్ ఎక్కడ తెచ్చుకోవాలో తెలియక రేషన్ వాహనం ఇళ్ళ దగ్గరికి వస్తుందో రాదో అని పనులు మానుకొని ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యంగా నందమూరి నగర్‌లో ఇప్పటికీ వరకు ఈనెల రేషన్ పేద ప్రజలకు అందలేదన్నారు. ప్రజలు రేషన్ స్టోర్‌ల దగ్గరికి వెళ్లి మాకు రేషన్ వేయండి అని అడిగితే ఒకరోజు వేసినాము, రెండు రోజులు వేసినాము అని పొంతన లేని సమాధానం చెబుతూ రేషన్ అయిపోయింది అని అంటున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం ఇచ్చే రేషన్‌ను సక్రమంగా సరఫరా చేసి స్టోర్లలో వేస్తారో ఇళ్ల దగ్గరికి వాహనాలలో తీసుకోని వచ్చి వేస్తారో వార్డులలోని ప్రజలకు తెలియజేసి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని సిపిఐ పట్టణ సమితి తరపున కోరారు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి
ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర-చాగలమర్రి .. గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ రాజ్ అధికారులు ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలియజేశారు. మండలంలోని తోడేండ్లపల్లె, మల్లెవేముల గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో విషజ్వరాల ప్రభావంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కాలనీల్లో పర్యటించి పారిశుధ్యం, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో విషజ్వరాలు తగ్గే వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు ఉన్న వారు వైద్య సిబ్బంది సూచనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో విషజ్వరాలు తగ్గేవరకు వైద్య సిబ్బంది దగ్గరుండి ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి వరప్రసాద్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, వైద్యులు శివ మోహన్, ఎంపీడీవో మహబూబ్ దౌలా,, ఈవోపీ ఆర్డి తాహీర్ హుసేన్, పంచాయతీ కార్యదర్శులు దాసు, ఆదినారాయణ, ప్రదీప్ రెడ్డి,లీలావతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్‌ఉన్ నబీ

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తి శ్రద్ధలతో ముస్లింలు జరుపుకున్నారు. నంద్యాల పట్టణంలో మంజుపీర్ దర్గా వారు ఏర్పాటు చేసిన ర్యాలీలో నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, దర్గా పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఈ పండగని ముస్లిం హిందూ అనే భేదాభిప్రాయం లేకుండా అందరూ కలిసి జరుపుకుంటారని, ఈ పండుగకు ఇదే గొప్పతనం అన్నారు. అందరూ ఆయురారోగ్యాలతో కలిసి మెలిసి ఉండాలని అన్నారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలలో ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా పెద్దలు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్, 11వ వార్డు టిడిపి ఇన్చార్జ్ అఫ్జల్, మంజుపీర్ దర్గా పెద్దలు పాల్గొన్నారు.

మల్లెం గ్రామంలో

విశాలాంధ్ర, జూపాడుబంగ్లా: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం అన్ని గ్రామాల్లోని మసీదులలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. మల్లె గ్రామంలోని టిడిపి నాయకులు గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య ముఖ్య అతిథిగా హాజరై మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి, రమణారెడ్డి, జంగాల పెద్దన్న, పిక్కిలి శ్రీనివాసులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో రక్త దానశిబిరం

విశాలాంధ్ర-నంద్యాల : మీలాదున్ నబి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాల గాంధీచౌక్ లో రక్త దానశిబిరం నిర్వహించినట్లు గులాబ్ షా వలి దర్గా కమిటీ, దర్గా మూతవల్లిలు సయ్యద్ గులాబ్, సయ్యద్ సయ్యద్ సా సాహెబ్‌లు తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం తరహా ఈ సంవత్సరం కూడా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. రక్తదానం చేయడం వల్ల పలువురి ప్రాణాలు కాపాడిన వారమవుతావని కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని వారు పిలుపునిచ్చారు.

బనగానపల్లెలో ..

బనగానపల్లెలో ..

విశాలాంధ్ర బనగానపల్లె: మహమ్మద్ ప్రవక్త జన్మదినంగా భావించే మీలాద్ ఉన్ నబి పండుగని అల్లాహ్ తరువాత ముస్లింలు అత్యధికంగా గౌరవించేది మహమ్మద్ ప్రవక్తనే అందుకే ఇస్లాంలో ఆయనకు అంత గౌరవం ఉందని అబ్దుల్ ఉసేని సాహెబ్ ఖాద్రి అన్నారు. పట్టణంలోని పెట్రోల్ బంక్ కూడలి నుండి ప్రధాన వీధులలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ హుస్సేన్ ఖాద్రీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడవాలన్నారు. ఇస్లామిక్ కేలండర్ ప్రకారం రబీ ఉల్ అవ్వల్ 12వ రోజు అంటే సెప్టెంబర్ 16న మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును జరుపుకుంటారని ప్రపంచంలో శాంతిపూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అన్నారు. అనంతరం జండే వాలే సాహెబ్ దర్గా వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బిస్కెట్లు పంపిణీ

విశాలాంధ్ర, బనగానపల్లె : మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా పట్టణంలోని పెట్రోల్ బంక్ సర్కిల్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గౌరవాధ్యక్షుడు టంగుటూరి సీనయ్య ఆధ్వర్యంలో బిస్కెట్లు పంపిణీ చేశారు. టంగుటూరి సీనయ్య మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో హిందువులు ఐకమత్యంగా ఒకరి పండుగను ఒకరు గౌరవించు కుంటు కలిసిమెలిసి ఉంటారని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ మొన్న గణేష్ నిమజ్జనం సందర్భంగా ముస్లింలు మజ్జిగ పంపిణీ నేడు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బిస్కెట్లు పంపిణీ చేయడం హిందూ ముస్లింల ఐకమత్యంనికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జనసేన భాస్కర్, టీచర్ నాగరాజు, కోడి నాగేష్, భూపాల్ యాదవ్ పాల్గొన్నారు.

చింతలాయపల్లెకు తీరిన దాహం

- అవుకు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు
- తాగునీటి సరఫరా షురూ -విశాలాంధ్ర కథనంపై స్పందన

విశాలాంధ్ర, కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయపల్లిలో నెలకొన్న తాగునీటి కష్టాలపై సోమవారం విశాలాంధ్రలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. అవుకు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి గ్రామానికి తాగునీటిని సరఫరా చేశారు. తీవ్ర వర్షాభావంతో గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధించిన కొన్ని బోరు బావులు ఎండిపోగా మరికొన్ని అరకొరగా పని చేస్తుండటంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. పేజ్ 3 కింద అవుకు రిజర్వాయర్ నుండి గ్రామానికి తాగునీరు అందించేందుకు పైప్లైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో అరకొరగా గ్రామానికి తాగునీరు అప్పు డప్పుడు సరఫరా అయ్యేది. గ్రామంలోని బోరుబావులు, అవుకు తాగునీటి పథకం నుండి తాగునీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విశాలాంధ్ర కథనానికి స్పందించి అధికారులు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటిని ఓవర్ ట్యాంకుకు నింపి ఆయా కాలనీలకు కుళాయిల ద్వారా అందించారు. తాగునీటి కష్టాలు తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

- చాగలమర్రి అబెట్ ద్రావణాన్ని పిచికారి
- విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-చాగలమర్రి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 15న విశాలాంధ్ర లో ప్రచురితమైన ప్రబలుతున్న విషజ్వరాలు అనే శీర్షికకు స్పందించిన అధికారులు మండలం లోని తోడేండ్లపల్లె,మల్లెవేముల గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసారు. తోడేండ్లపల్లె గ్రామంలో వైద్యాధికారి శివమోహన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపిడీఓ మహబూబ్ దౌలా,ఈఓఆర్డి తాహీర్‌హుసేన్,వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఫీవర్ సర్వే నిర్వహించి,రక్త నమూనాలు సేకరించి కీటక జనిత వ్యాధుల నియంత్రణా కార్యక్రమం కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసారు. పారిశుద్ధ్య చర్యలలో భాగంగాఎంపిడీఓ మహబూబ్ దౌలా,ఈఓఆర్డి తాహీర్‌హుసేన్,వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంచి నీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించి మురికి నీరు ఉన్న చోట అబెట్ ద్రావణాన్ని పిచికారి చేసారు.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతుండటంతో ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. కార్యక్రమంలో ఆళ్ళగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు,పంచాయతీ కార్యదర్శులు దాసు,ప్రదీప్, సిహెచ్ఓ తేజ, ఏఎన్ఎంలు రాణి, సుభాషిణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా

విశాలాంధ్ర-డోన్ : ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.పట్టణ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిబ్బంది పెంచుతామన్నారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ పోలీసులు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవడం సంతోషమన్నారు. కార్యక్రమంలో డోన్ డిఎస్పీ శ్రీనివాసులు, సి ఐ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 17,సెప్టెంబర్ 2024

వైద్యం ప్రైవేటీకరణ ఆలోచన ప్రభుత్వం విరమించు కోవాలి

విశాలాంధ్ర-కర్నూలు : రాష్ట్రంలో వైద్య విద్య ప్రైయివేటీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తున్నట్లు వస్తున్న కథనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే విరమించు కోవాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు కేటాయింపుపై వైసీపీ విడుదల చేసిన జీవో.నెంబర్ 107, 108 లను నూతనంగా అధికారంలోకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా సీట్లను భర్తీ చేయడానికి రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ మరో వైపు వైద్య రంగాన్ని గుజరాత్ తరహాలో ప్రైవేటు రంగానికి అప్పగించే ఆలోచనకు మరింత బలం చేకూరుతుంది. 1992లో అప్పటి ముఖ్యమంత్రి విచ్చలవిడిగా అనర్హులకు ప్రైవేటు మెడికల్, దంత వైద్య కళాశాలలను మంజూరు చేసినపుడు జరిగిన విద్యార్థి, యువజన ఉద్యమాల ఫలితంగా నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గద్దె దిగిన సంఘటనను కూడా గుర్తుంచుకోవాలన్నారు. పేద బల హీన, దళిత, గిరిజన వర్గాలకు వైద్యవిద్య అందుబాటులో లేకుండా చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటన లో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెర్నేకల్‌లో ఉచిత హోమియోపతి

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్ : తెర్నేకల్ గ్రామంలో ఉచిత హోమియోపతి వైద్యం డాక్టర్ యు సోమశేఖర్ మరియు గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా డెంగ్యూ చికెనుగున్యా వంటి వ్యాధులకు హోమియోపతిలో వైద్యము ప్రజలకు ఉచితముగా మందులు పంపిణీ చేయడం జరిగింది.దాదాపుగా 200 మందికి ఉచిత హోమియోపతి మాత్రలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ డాక్టర్ యు రాజశేఖర్ హోమియోపతి బావిం దొడ్డి నాగభూషణం సగరం సంఘ అధ్యక్షులు గద్దం నాగరాజు .ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు. మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటింటికి స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తాం-సర్పంచు మస్తాన్‌బి

విశాలాంధ్ర-తుగ్గలి: గ్రామంలోని ఇంటింటి కి నీటి వసతి ఏర్పాటు చేసి గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపమని తెలిపారు. మండల పరిధిలోని కడమకుంట్ల కొట్టాల కాలనీ, బొడ్రాయి నుండి మసీదుకు వెళ్లే కాలనీలో సర్పంచు మస్తాన్‌బి గౌరవ సలహాదారుడు, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్‌లు సోమవారం ఇంటింటి కుళాయిల పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ మస్తాన్ బి,సర్పంచ్ సలహాదారుడు సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ లు మాట్లాడుతూ కడమకుంట్ల గ్రామ పంచాయతీలోని హుస్సేనాపురం, లంకాయ పల్లి, రోల్లపాడు,కడమకుంట్ల గ్రామాలలో ప్రజలకు శాశ్వతమైన త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అందులో భాగంగా కడమకుంట్ల గ్రామంలోని కొట్టాల కాలనీ, బొడ్రాయి నుండి మసీదు వరకు వెళ్లే కాలనీలో ఇంటింటి కొళాయిల పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

అలాగే గ్రామంలో వీధిలైట్లు,డ్రైనేజ్ సమస్య తదితర గ్రామ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అన్ని సమకూర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు మాజీ ఎంపీపీ భర్త హనుమంతు, సుధాకర్,కాసింవలి, టీడీపీ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వక ప్రాంతాల్లో తనిఖీలు

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : హాలహర్వి మండలంలోని అర్ధగిరి గ్రామం వద్ద జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపంలోని సర్వే నెంబర్ 104 అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకు సమాచారం అందడంతో

సోమవారం సంబంధించిన ప్రాంతానికి సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ అన్నారు. 104 సర్వే నెంబర్ గుంట ప్రాంతమని ఆ భూమి ప్రభుత్వానికి చెందిందని ఆ ప్రాంతం నుంచి సర్పంచు మట్టిని తరలించి కస్తూరిబా పాఠశాల ప్రాంతంలో మురికి నీటి ప్రాంతానికి తోలుతున్నట్లు చదును చేయడానికి ఉపయోగించారని తేలిందని అక్కడ నుంచి 470 కి మీకు మీటర్ల గ్రావెల్ తరలించడం జరిగిందని దీనిపైన లోతుగా విచారించడం జరిగింది. ఇది ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయిందని అన్నారు. విజిలెన్స్ రాయల్టీ ఇన్స్పెక్టర్ మురహరి మధు స్థానిక రెవిన్యూ సిబ్బంది అలహరి రెవిన్యూ సిబ్బంది వీఆర్వో సర్వేలు పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం-ఎస్టీయూ

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : ఎస్టీయూ ఆదోని డివిజన్ ఆధ్వర్యంలో మధు హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఉపాధ్యాయులకు మరియు ఉద్యోగులకు సోమవారం స్థానిక మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విశ్వనాథ్ ,మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో గుండె,ఎముకలు,కంటి సంబంధిత వ్యాధులు మరియు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. శిబిరానికి దాదాపుగా 150 మంది ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగింది. శిబిరంలో మధు హాస్పిటల్స్ వారు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి సంబంధిత వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎస్టియు నిత్యం ఉపాధ్యాయులు సేవలో ముందు ఉంటుందని, ఉపాధ్యాయుల సమస్యలు ఒకటే కాదు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయడంలో కూడా ఎస్టీయూ ముందుంటుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు రమేష్ నాయుడు,కన్వీనర్ ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ వీరచంద్ర యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న , ఆదోని మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతకుంట రామకృష్ణ,సుధాకర్ బాబు, ఆదోని పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనకు టీడీపీ కట్టుబడి ఉంది-ఎంపి నాగరాజు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: బీసీ కుల గణనకు తెలుగు దేశం పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. సోమవారం స్థానిక బి.క్యాంపులోని బీసీ భవన్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన కార్యరూపం దాల్చితే చట్టసభల్లో బీసీల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే రాజకీయంగా, ఆర్థికంగా బీసీలు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. అందుకు తనను ఒక ఉదాహరణగా చెప్పుకొచ్చారు. బీసీ నేతల సహకారంతో కర్నూలు ఎంపీగా విజయం సాధించానని, వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన బీసీ భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతో పాటు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీ భవన్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. తిరిగి అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం నూతన బీసీ భవన్ నిర్మాణంతో పాటు పాత భవనానికి కూడా మరమ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. బీహార్ రాష్ట్రం తరహాలో బీసీ కులగలను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు చెప్పిం దని, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ సంఘం నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. పరీక్షలకు పోటీపడుతున్న బీసీ యువతకు శిక్షణాకేంద్రం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని కోరారు.నూతన బీసీ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని బీసీ సంఘం నేతలతో కలసి ఆయన పరిశీలించారు.నాయకులు మురళి మనోహర్, రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

దళిత మహిళకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: పెద్దకడబూరు మండలం కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మకి గ్రామ బీసీ సామాజిక వర్గం వారు కరెంటు స్తంభానికి కట్టివేసి విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచిన పరిస్థితి విధితమే. చేయూత స్వచ్ఛంద సంస్థ ఎమ్మిగనూరు సభ్యులు ఘటనపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సోమవారం బాధితురాలిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా ప్రసన్నరాజు మాట్లాడుతూ దళిత మహిళపై అమానుషంగా అక్కడివారు ప్రవర్తించడం క్షమించరాని నేరమన్నారు. నేటికి పలు ప్రాంతాల్లో దళితుల పట్ల అంటరానితనాన్ని చూపిస్తూ అణిచివేస్తున్నారని దీనిని పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు.ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.బాధితురాలు గోవిందమ్మకు చేయూత స్వచ్ఛంద సంస్థ సేకరించిన రూ.30 వేలు, నందవరం అంబేద్కర్ యూత్ సభ్యులు సేకరించిన రూ. 6,500 కలిపి ఆమెకు అందజేశారు.ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాదన్న, భాస్కర్, అడివన్న, హంపయ్య, ఎల్లప్ప, ప్రవీణ్, రంగస్వామి, మద్దిలేటి,ప్రభాకర్ మరియు నందవరం అంబేద్కర్ యూత్ సభ్యులు ప్రకాష్, వినోద్‌కుమార్, రంగస్వామి, వినోద్, భరత్, బాలరాజు రాజు,శాంసన్,సజీవ్‌అభినయ్, అభిషేక్, పెద్దయ్య,కేశన్న,దేవరాజు ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించేందుకు అనుమతి ఇవ్వండి

విశాలాంధ్ర-పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి ఘటనలో భాగంగా అక్కడి దళితులను పరామర్శించేందుకు అనుమతి ఇవ్వాలని పెద్దకడబూరు గ్రామ దళిత నాయకులు ఏసేపు, ముక్కరన్న, అర్లప్ప, విజయ్ కుమార్, ఆశన్న, ఆనందరాజు, నరసన్న, బుజ్జప్ప, మేకల రాజు, సుందరం, కుమార్‌లు సోమవారం పోలీసు స్టేషన్‌కెళ్లి ఎస్ఐ నిరంజన్ రెడ్డిని కలిసి కోరారు. దాడి కేసుపై సమగ్ర విచారణ చేసి అసలైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

దళితులపై దాడులు చేస్తే సహించం

విశాలాంధ్ర-పెద్దకడబూరు: దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, విజయ్ కుమార్‌లు హెచ్చరించారు. సోమవారం ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రులో చికిత్స పొందుతున్న కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మను టీడీపీ నాయకులు ఏసేపు, విజయ్ కుమార్ లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా బీసీకులాలు మాదిగ గోవిందమ్మను గ్రామంలో కరెంటు తీయించి, విద్యుత్ స్థంభానికి కట్టేసి వివస్త్రను చేసి విచక్షణా రహితంగా కొట్టడంతో పాటు ఒక వికలాంగుడితో తాళి కట్టించడానికి ప్రయత్నించడం దారుణమని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి ఇలాంటి సంఘటనలు మరో మారు జరగకుండా ఎస్సీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈకెవైసీ గడువు పొడుగింపు

విశాలాంధ్ర-గోనెగండ్ల: ఖరీఫ్ 2024కు పంట నమోదు మరియు రైతుల ఈకెవైసీ ఈనెల 23 వరకు పొడిగించినట్లు ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. మహమ్మద్ ఖాద్రి తెలిపారు.సోమవారం మండల పరిధిలోని హెచ్.కైరవాడిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు ఈకెవైసీ కార్యక్రమం చేపట్టారు.

అలాగే పంట నమోదు పూర్తి అయి ఇంతవరకు ఈకెవైసీ చేయించుకొని రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈకెవైసీ తప్పకుండ చేయించుకోవాలన్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో పంట నమోదు 98 శాతం పూర్తి అయ్యింది, కానీ రైతుల ఈకెవైసీ ఇప్పటివరకు 73 శాతం పూర్తి అయినది.రైతులు ఈకెవైసీ పూర్తి చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతాయి.

ఈకెవైసీ పూర్తి చేసుకుంటేనే పంటల భీమా,ఏదైనా పంట నష్టం, సున్నా వడ్డీ పంట రుణాలు, పండించిన పంట కొనుగోలు చేయడం జరుగుతుంది. పంట నమోదు చేసుకొన్న రైతులందరు తప్పకుండ ఈకెవైసీ పూర్తి చేసుకోవాలి.ఈకెవైసీ నమోదు చేసుకోవడానికి ఈనెల 23 వరకు గడువు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో హేమలత, సిబ్బంది, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి కూతురికి ఎంబీబీఎస్ సీటు

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన మాల ఈరన్న శేఖమ్మ దంపతుల పెద్ద కూతురు రమ్యశ్రీ కి ఇటీవల జరిగిన నీట్ ఫలితాల్లో నీట్ ఫలితాల్లో 536/720 రాష్ట్రస్థాయిర్యాంక్ 5540 సాధించింది. ఆలిండియా ర్యాంక్ 1,55,268 సాధించింది. నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు రావడంతో తిరుపతి పద్మావతి మెడికల్ ఉమెన్ కళాశాలలో సీటు పొందింది. వీరి తండ్రి వృత్తిరీత్యా గొర్రెల కాపరి తల్లి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అమ్మాయికి ఉచితంగా సీటు రావడం పట్ల వీరి తల్లిదండ్రులు గ్రామస్తులు బంధుమిత్రులు వర్షం వ్యక్తం చేశారు. తనలాగే మండలం పరిధిలో బాల బాలికలు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రమ్యశ్రీ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సంజమ్మ అవ్వ ఆరాధన మహోత్సవం

విశాలాంధ్ర-ఓర్వకల్లు: మండలంలోని నన్నూరులో సోమవారం సంజమ్మవ్వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అవ్వ సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించారు. ఆరాధన సందర్భంగా భజన కార్యక్రమం చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాల అనంతరం అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది అవ్వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నన్నూరు పూడిచేరళ్ల భైరపురం లొద్దిపల్లె తదితర గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

నేడే జవహర్ నవోదయలో క్లస్టర్ స్థాయి కళాఉత్సవాలు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళ,బుధవారాలు (రెండు రోజుల)పాటు క్లస్టర్ స్థాయి కళా ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 16 నవోదయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. రెండురోజులు నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్లస్టర్ స్థాయి కళాఉత్సవం 9వ తరగతి నుండి 12వ తరగతి విద్యార్థుల మధ్య పోటీ ఉంటుందని వివరించారు. దీనిలో 1 విద్యార్థి మరియు గరిష్టంగా 5 మంది విద్యార్థులు పాల్గొం టారు. కళా-ఉత్సవం కార్యక్రమం 6 విభాగాలుగా విభాగించారు. 1. స్వర సంగీతం: (క్లాసికల్, జానపదం, గిరిజన, భక్తిప్రవత్తులు) 2.వాయిద్య సంగీతం : (క్లాసికల్/పెర్కషన్/ మెలోడిక్, ఆర్కెస్ట్రాసమిష్టి, జానపద/క్లాసికల్) 3. నృత్యం (క్లాసికల్ : భారతదేశంలోని ఏదైనా శాస్త్రీయ నృత్య రూపం,ప్రాంతీయ (జానపద/గిరిజన),సమకాలీన కొరియోగ్రఫీ (సినిమాయేతర)4. థియేటర్:(మోనో యాక్ట్, మిమిక్రీ, మైమ్, సమూహంలో ప్లే/డ్రామా), 5. విజువల్ ఆర్ట్స్:2 డైమెన్షనల్ (డ్రాయింగ్, పెయింటింగ్, ప్రింటింగ్, కార్టూన్, క్యారికేచర్), 3 డైమెన్షనల్ (శిల్పం, మొబైల్‌లు),స్వదేశీ బొమ్మలు మరియు ఆటలు స్థానిక చేతిపనులు.

6. సాంప్రదాయ కథ చెప్పడం:డ్యాన్స్, డ్రామా, సంగీతం లేదా విజువల్ ఆర్ట్స్ లేదా ఒకటి కంటే ఎక్కువ కళారూపాలను కలుపుకొని సాంప్రదాయక కథలు చెప్పడం.ఇక్కడ ఎంపికైన విద్యార్థులందరూ ప్రాంతీయ స్థాయి ఎంపిక జేఎన్ వికోజికోడ్ (కేరళ)లో జరుగుతుందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు.

మాచాపురం వైసీపీ నాయకులకు బుద్ధి మందగించింది

విశాలాంధ్ర-నందవరం : మాచాపురం వైసీపీ నాయకులకు మందగించి మాట్లాడుతున్నారని టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం గ్రామ టీడీపీ ఉపఅధ్యక్షులు దేవసహాయం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాభాషలు మాట్లాడుతూ గ్రామ వైసీపీ నాయకులు చెరువులో నీళ్లు లేవని అంటున్నారు..మరి చెరువు దగ్గరి కొస్తే మేము చెరువులో ఉండే నీళ్లను మీకు మేముచూపిస్తామన్నారు. చెరువు లో నీళ్లు లేకుంటే చెరువు చుట్టూ 100 ఎకరాల నుంచి 120 ఎకరాలు దాకా వరి నాట్లు ఎలా వేస్తారని టిడిపి నాయకులు విమర్శించారు. చిలకలదోన గురురాఘవేంద్ర ప్రాజెక్టు అధికారులు ఏఈ, డిఈ, కడగొమ్మను దగ్గరుండి పగలగొట్టడం జరిగిందని, అప్పుడు మీరు అధికారంలో ఉన్నారు కదా మరి మీరు ఎందుకు ఆ పనిని ఆపలేక లబెట్టే పోయినారని ఎద్దేవా చేసారు. 2023 చేతికొందిన పంటను నీళ్లు లేక కోసివేయాలేదా అని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాసింవలి సహకారంతో యువ నాయకుడు యస్. బడేసాబ్ వలి తన సొంత ఖర్చులతో ఎల్ఎల్సి చెరువులో నింపడడం జరిగిందన్నారు. దీంతో నేడు వరి, మిరప, పత్తి, ఉల్లిగడ్డ పంటలకు నీటిని వాడుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుభాష్, తేజేశ్వర నాయుడు, రత్నం, భూపతి, చిన్న రాజు మరియు రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా లో భాగస్వామ్యం అవ్వాలి

అక్టోబర్ 2న 'స్వచ్ఛ భారత్ దివస్'

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబర్ 2న 'స్వచ్ఛ భారత్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో రేపటి నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నగరంలో 'స్వచ్ఛతా హీ సేవా' పేరుతో రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తొలిరోజు మంగళవారం ఉదయం 07:30 గంటలకు, నగరపాలక అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో కలిసి కలెక్టరేట్ నుంచి రాజ్ విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అక్కడే మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీకి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరు అవుతారని పేర్కొన్నారు. పరిశుభ్రమైన దేశం - సురక్షిత ప్రజారోగ్యం కోసం నగరపాలకతో కలిసి స్వచ్ఛా హీ సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలని కమిషనర్ కోరారు. పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, బహిరంగ స్థలాల్లో ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన, తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యానవనాలు - పర్యాటక కేంద్రాల సుందరీకరణ తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు.

సీయం సహాయనిధి చెక్కును అందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నందవరం : మండలంలోని పరిధిలోని గురజాల గ్రామాలానికి చెందిన మంగలి నరేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ యందు చికిత్స పొందగా, వారి వద్ద ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యే డా. బివి జయనాగేశ్వర రెడ్డి సంప్రదించగా వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించవలసినదిగా సియంను కోరగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దరకాస్తు చేయడం జరిగిందని, దింతో మంగలి నరేష్ రూ.2 లక్షల మంజూరు కాగా, చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. తమకు కష్టసమయంలో ఆదుకున్నందుకు సియం చంద్రబాబు, తమ సమస్యపై వెంటనే స్పందించినందుకు ఎమ్మెల్యే డా బివి జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించండి

విశాలాంధ్ర-పెద్దకడబూరు: శాంతి భద్రతలకు గ్రామ ప్రజలు సహకరించాలని తహసీల్దార్ శ్రీనాథ్ కోరారు. సోమవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెటింగ్‌ను మండల తహసీల్దార్ శ్రీనాథ్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ మహేష్‌లు పరిశీలించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనాథ్ మాట్లాడుతూ గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి నేపథ్యంలో గ్రామంలో పోలీసు పికెటింగ్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 30 తేదీ వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు నగదు అందజేసిన బొల్లవరం నాయకులు

విశాలాంధ్ర-కల్లూరు: వరద బాధితుల సహాయార్థం బొల్లవరం గ్రామ, మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు ఆధ్వర్యంలో రూ. 47,340ల నగదును పాణ్యంఎమ్మెల్యే చరితను కలిసి అందజేశారు.

ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే స్వగృహానికి బొల్లవరం టీడీపీ నాయకులు కార్యకర్తలు చేరుకొని నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మస్తాన్ నాయుడు, జానకిరాముడు, మధు, చైర్మన్ మస్తాన్ నాయుడు, ఉపాధ్యక్షులు లక్ష్మన్న, బాలాజీ సురేంద్ర, వెంకటేశ్వర్లు, మౌలాలి, ప్రసాద్ గౌడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాస పద గేయాల పుస్తక పరిచయం

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన **'ప్రాస పద గేయాలు'** పుస్తక పరిచయ సభ సోమవారం గాంధీవనం, నరసరావుపేటలో అశ్లీలత ప్రతిఘటన వేధిక అధ్యక్షులు, శ్రీనాథ సాహితీ పరిషత్ వ్యవస్థాపకులు స్వర్ణ చిన వెంకటరామిరెడ్డి, సామాజిక కార్యకర్త కోడెల శ్రీనివాసరావు, స్కౌట్‌మాస్టర్లు వమ్మి వెంకటరెడ్డి,మామిళ్ల కృష్ణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు మరియు ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. అనంతరం కృతి కర్త గద్వాల సోమన్నను అనతికాలవ్యవధిలో అర్ధశతాధిక పుస్తకాలు ప్రచురించినందుకు గాను, బాలసాహిత్యంలో విశేష కృషికి గాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ వనం వ్యవస్థాపకులు ఈదర్ గోపిచంద్ మాట్లాడుతూ మాతృభాష తెలుగు పరిరక్షణతో పాటు గాంధీ సిద్ధాంతాలను ఆకలింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబాయి పూలే ఏ.పి.బిసి.వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఆరిఫా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే జొన్నలు కొర్రల క్రయ విక్రయాలు

విశాలాంధ్ర-జిల్లా పరిషత్: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు మరో రెండు పంటలను అమ్ముకునే సదుపాయాన్ని కల్పించడానికి మార్కెట్ కమిటీ అధికారులను ఏర్పాటు చేశామని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుండి మార్కెట్‌యార్డులో రైతులు పండించిన కొర్రలు, జొన్నలు క్రయ విక్రయాలు చేపట్టవచ్చని ఈ నామ్ పద్ధతిలో జొన్నలు, కొర్రలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకొచ్చారు. ఇప్పటివరకు పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దళారీలకు తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారని ఈ కొనుగోలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రైతులు అవకాశాన్ని వినియోగించుకుని పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవాలన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర-హొళగుంద : మండల ప్రజా పరిషత్ నిధులు నుండి పెటే బసవేశ్వర గుడి నుండి శరవన్న ఇంటి వరకు సిసి రోడ్ నిర్మాణం పనులను సోమవారం వైసీపీ నాయకులు ఈసా, మల్లయ్య ప్రారంభించారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వర్షాకాలంలో రోడ్డుపై తిరగాలంటే గగనంగా ఉండేదని కాలనీవాసులు పేర్కొన్నారు. సీసీ కొత్త రోడ్డు వేయడం పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతల మయంగా ఉండడంవల్ల పంచాయితీ అధికారులు ఎర్ర మట్టిని వేసి చదును చేశారు. అయితే వర్షానికి ఎర్రమట్టి నాని చిత్తడి చిత్తడిగా రోడ్డు మారడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సీసీ రోడ్డు వేయడం పట్ల ప్రజల రాకపోకలతో పాటు వాహనాల రాకపోకలకు ఎంతో అనుకూలమైందని వైసీపీ నాయకుడు మల్లయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కంచప్ప, మల్లయ్య, రమేష్ ఎంపీటీసీ, శివన్న,, ,మరియు కాలిని వాసులు అబ్దుల్లా, హనీఫ్, హుస్సేన్ పీరా, అబ్దుల్ సలాం, రహంతుల్లా, హమీద్, ప్రజలు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-కోసిగి : స్థానిక రైల్వే గేటు సమీపంలో కోసిగికి చెందిన బలకుందు. కోసిగయ్య (52) సోమవారం 1:30 గంటలకు కోసిగి- ఐరనగల్ 523/40-42 కిలోమీటర్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాగుడుకు బానిసై, కుటుంబ కలహాలతో గూడ్స్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య యత్నంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర-ఆస్పరి: విశ్వమానవాళికి అల్లా చివరిదూత అయిన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మసీదులలో నమాజ్‌లు నిర్వహించిన అనంతరం మహమ్మద్ ప్రవక్త జీవితం గురించి, ఇస్లాం గురించి మతపెద్దలు వివరించారు. వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో ముస్లిం మత గురువు షేక్ సాహెబ్, ఇస్మాయిల్‌ల ఆధ్వర్యంలో సాయంత్రం ముస్లింలు, యువత గ్రామ పురవీధుల గుండా మహ్మద్ ప్రవక్త వచనాలతో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్ళి ఊరేగింపు నిర్వహించారు. ప్రవక్త పుట్టినరోజు ప్రపంచానికే పర్వదినం లాంటిదన్నారు.

మహమ్మద్ ప్రవక్త సందేశం మానవాళికి హితోపదేశం

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : మహమ్మద్ ప్రవక్త సందేశం సర్వ మానవాళికి హితోపదేశాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పరిగెల మురళి కృష్ణ అభిప్రాయపడ్డారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మహమ్మద్ నూర్ అధ్యక్షతన సిటీ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, సయ్యద్ ముర్షిద్ పీర్ ఖాద్రి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ క్రీ.శ. 570లో అరబ్ దేశంలోని మక్కా నగరంలో ఖురైషు వంశంలో హజరత్ అబ్దుల్లాహ్, బిబి అమీనా దంపతులకు పుట్టిన మహమ్మద్ కాలగతిని మార్చిన శూరుడనీ, మూఢ జనాన్ని మహాజ్ఞానులుగా మార్చగలిగిన అద్వితీయసంస్కర్త అని, మహమ్మద్ అందించే ఏకైకఅల్లాహ్‌తో ఆధ్యాత్మిక విప్లవం ఊపందుకుందని మహమ్మద్ ప్రవక్తపసితనంలోనే తండ్రిని, తల్లిని కోల్పోయిన బంధు జనాల ప్రేమ వాత్సల్యాలను చురగొన్నారని, మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజుని ప్రశాంతంగా జరుపు కోవడం ఆయన సందేశాన్ని ప్రజలకు అందించడమే నిజమైన పండుగ అని మహమ్మద్ ప్రవక్త ఇతరులకు సహాయం చేయండి కానీ చెడు చేయవద్దు అన్నాడని ఆయన సందేశాన్ని మనం పాటించి ప్రజల వద్దకు తీసుకొని వెళితేనే నిజమైన పండుగని ప్రవక్తను మనం గౌరవించిన వారమవుతామని కాంగ్రెస్ పార్టీ శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వానికి కట్టుబడి ఉంటుందని సర్వ మతాలను సమానంగా చూసే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒకటేనన్నారు. కొన్ని పార్టీలు ముస్లింలకు వ్యతిరేకంగా బిజెపి ప్రవేశ పెట్టే ఏబిల్లు కైనా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తారని బిజెపిని వ్యతిరేకించే పార్టీ ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, దేశానికి మంచి జరగాలని మనమందరం దేవుని ప్రార్థించాలని అలాగే ముస్లిం పెద్దలందరికీ మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలుపు తున్నామని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని మీకందరికీ హృదయపూర్వక నమస్కారములు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని మురళీకృష్ణ తెలియజేశారు. అనంతరం మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సూక్తులు సమాజానికి ఆదర్శమని తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబి కార్యక్రమం ఏ రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో చేయలేదని కానీ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని మహమ్మద్ ప్రవక్త సూక్తులు మానవాళికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. అనంతరం పండుగ సందర్భంగా మిఠాయిలు పంచారు.

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకుని సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జామియా మసీదు నుండి ముస్లిం సోదరులు జెండా చేతపట్టి నారే తగ్బీర్ అల్లాహు అక్బర్ అనే నిదానాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. జామియా మసీదు నుండి ఖునీ పంజా మైదానం, సున్నం బట్టి మసీద్, గోనెగండ్ల రోడ్డు, ఆఫీస్ మసీద్, గాంధీ సర్కిల్ సోమప్ప సర్కిల్ మీదుగా తిరిగి జామియా మసీదు వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింమైనార్టీ నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-హొళగుంద : హొళగుందలో ముస్లిం

సోదరులు సోమవారం ఈద్ మిలాద్ దున్ నబీ పండుగను ఘనంగా జరిపారు ఆహలేసున్నతుల్ జమాత్ మరియు సున్ని స్టూడెంట్ స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పండుగ ర్యాలీని స్థానిక రాజా నగర్ మసీదు , సున్ని మొహమ్మదియా (శాలి మసీదు) నుండి ముస్లిం సోదరులు, మదరేసా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు మౌలి టిప్పు రాజా మాట్లాడుతూ సర్వ మానవాళికి అవతరించిన కురాన్ గురించి దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అందరికీ తెలియజేస్తారని దైవ ప్రవక్త అడుగుజాడల్లో అందరూ నడవాలని ప్రపంచ శాంతి కోసం అందరూ కలిసిమెలిసి ఉండాలని దేశాభివృద్ధికి అంకితం అవ్వాలని దేశ రక్షణ కోసం అందరూ నడుం బిగించాలని ఉపదేశించారు హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలిసి మతసామరస్యంతో కలిసిమెలిసి జీవించాలని కోరారు సున్నీ మసీదులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు అలాగే ముస్లిం సోదరులు ప్రత్యేక ఫాతిహాలు చదివించారు మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్ ముబారక్ పండుగను ఘనంగా జరిపారు పండుగలు ఎలాంటి ఘర్షణలు లేకుండా ఎస్సై బాల నరసింహులు పోలీస్ బందోబస్తు నిర్వహించారు ర్యాలీలో మూతవల్లి శాలి ఫక్రుద్దీన్ షాప్, మోసం గిద్దు సుభాన్ సాబ్, ముస్లిం మత పెద్దలు మచ్చెవలి సాబ్, శాలి షబ్బీర్, హరివాణం హబీబుల్లా, భంగిడి భాష, బీటీ వలి, బీటీ కలందర్, టీచర్ ఫక్రుద్దీన్, ఖాసీం వలి, కరూర్ పీరన్న, పి సనావుల్లా, బీఎస్పీరన్న, హొటల్ రాజా సాబ్, సాదాకలి, ముస్లిం సోదరులు, మదరస విద్యార్థులు, ఎస్ ఎస్ ఎఫ్ కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు మక్కా మదీనా చిత్రపటాలను పురవీధుల గుండా ఊరేగించారు పండుగ సందర్భంగా ప్రజలకు పాయసాన్ని పంపిణీ చేశారు ఒకరికొకరు కలుసుకొని హిందూ ముస్లిం సోదరులకు ఈద్ మిలాద్ శుభాకాంక్షలు తెలిపారు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట, కంబలదిన్నె, జాలవాడి, హెచ్ మురవణి, కంబదహాల్, చిన్నతుంబలం, బసలదొడ్డి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులో ముస్లిం మత గురువు రెహమాన్ ఆధ్వర్యంలో కొత్త మసీదు నుంచి మక్కా మసీదు నమూనాతో

ముస్లిం సోదరులు గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో మహ్మద్ ప్రవక్త పరవచనాలతో నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో ముస్లిం మత పెద్దలు, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గోనెగండ్ల: మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్క

రించుకుని సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో ముస్లీం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.గోనెగండ్లలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జామియా మసీదు నుండి ముస్లిం సోదరులు జెండా చేతపట్టి నారే తగ్బీర్ అల్లాహు అక్బర్ అనే నిదానాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. జామియా మసీదు నుండి మౌలాలి తాత దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం వృద్ధులకు, మహిళలకు, పాలు ,బ్రేడ్లు, పండ్లు, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు, ముల్లా షేక్,ముల్లా ఖాజవుశేన్,మేకానిక్ ముల్లా ఉసేన్ ముల్లా రహీం భాషా,దరగలమాబు, విలేఖరి మన్సూర్, డాక్టర్ మైబుబ్ భాషా, ముల్లా అఫ్రోజ్, ముల్లా రహీమాన్,తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఆస్పరి: విశ్వమానవాళికి అల్లా చివరిదూత

అయిన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మసీదులలో నమాజ్‌లు నిర్వహించిన అనంతరం మహమ్మద్ ప్రవక్త

జీవితం గురించి, ఇస్లాం గురించి మతపెద్దలు వివరించారు. వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో ముస్లిం మత గురువు షేక్ సాహెబ్, ఇస్మాయిల్ ల ఆధ్వర్యంలో సాయంత్రం ముస్లింలు, యువత గ్రామ పురవీధుల గుండా మహ్మద్ ప్రవక్త వచనాలతో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్ళి ఊరేగింపు (జులూస్) నిర్వహించారు. ప్రవక్త పుట్టిన రోజు ప్రపంచానికే పర్వదినం లాంటిదన్నారు. చెడును విడనాడి, మనిషి సన్మార్గంలో నడిపించిన మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణయోగ్యమన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని మత గురువులు ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు ఖాదర్ బాషా, జంసూర్, ఖలీల్, ముస్తాక్, ఇస్మాయిల్, గఫూర్, వలిభాష, రఫీ, మైబు, చిన్న పిల్లలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కోసిగి : మండలంలోని ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను చేశారు. మసీదులలో మహమ్మద్ ప్రవక్త యొక్క గొప్పతనాన్ని మత పెద్దలు ప్రసంగించారు. మిలాద్ ఉన్ నబీ వేడు కలను పురస్కరించుకుని గత వారం రోజుల నుంచి జామియా,నూరానీ సున్ని , మదీనా , మస్జిద్ ఏ అక్సా , మస్జిద్ ఏ అన్వరుల్లా ఫారుఖీ మసీదులలో ప్రత్యేకంగా ప్రసంగాలతోపాటు ప్రార్థనలు చేశారు. మసీదులను విద్యుద్దీపాలతో,జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహమ్మద్ ప్రవక్త ప్రపంచ శాంతి కోరిన గొప్ప దైవదూతని, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, శాంతి స్థాపనే లక్ష్యంగా మహమ్మద్ ప్రవక్త బోధనల తో స్ఫూర్తి పొంది , ఆయన అడుగు జాడల్లో నడిచి ఆయన ఆశయా సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ , ఎదుటి వారితో గౌరవంతో మెలిగి, ప్రేమానురాగాలతో , మంచి నడవడిక లో నడిచి ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనలో ఉండాలని మత పెద్దలు ప్రసంగించారు. ప్రతి ఒక ముస్లిం సోదరుడు పవిత్ర గ్రంథం ఖురాన్ ను చదివి ఆచరించాలన్నారు.ముస్లిం యువకులు , చిన్నారులు మక్కా మదీనా ప్రతిమలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని మక్కా , మదీనా ల ప్రతిమలను ఊరేగించారు.గ్రామంలో పెద్ద జెండాతో గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ, యువకులు ""కరేలా లతో"" బల ప్రదర్శన చేశారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మసీదులలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామ సమీపాన ఉన్న గోకర్ సాబ్ జెండా వద్ద జెండాను ప్రతిష్టించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా గోకర్ సాబ్ జెండా వద్ద గ్రామ సర్పంచ్.కుమారి.అయ్యమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు..

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : స్థానిక అసార్ మజీద్ లో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా జరిగాయి. మొహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం పుట్టినరోజుని పురస్కరించుకొని అసార్ మజీద్ లో అధిక సంఖ్యలో భక్తులు ప్రవక్త యొక్క తలనీలాలను దర్శించుకుని, భక్తి భావంతో ప్రార్థనలు చేసుకున్నారు. మౌలానా మొహమ్మద్ గౌస్ యాఖుబి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త యొక్క జీవిత చరిత్ర, వారి భక్తి భావం, ఇతరులతో ప్రవక్త నడుచుకునే విధానం, ఈ మిలాద్ ఉన్ నబి పండగ విశిష్టతను భక్తులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మౌలానా మొహమ్మద్ గౌస్ యాఖుబి, అసార్ మాలిక్, ఫ్రూట్ కలిముల్లా, షేక్ మాలిక్, అసార్ మాబు, ఎం. అమ్రుల్లా,అసార్ సయ్యద్, సొసైటీ ఖాదర్, బట్టల సుల్తాన్, ఖాజా మొద్దీన్, రఫిక్, ఇర్ఫాన్ , అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పాములపాడు: మహమ్మద్ ప్రవక్త జీవనం

సమస్త మానవాళికి ఆదర్శనీయమని భానుముక్కల మోమిన్ మసీద్ ముతవల్లి అబ్దుల్ మజీద్ అన్నారు. (మిలాద్ ఉన్ నబి) మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను పురస్కరించుకుని మండల పరిధిలోని భానుముక్కల గ్రామంలోని మోమిన్ మసీదు నందు ప్రవక్త సూచన మేరకు అల్లా పంపిన పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ను చిన్నారులకు చదివించారు.

బావురుమంటున్న బోరు బావులు..ఎండిన మొక్కజొన్న, వరి పంటలు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండలంలో కరువు మేఘం కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు లేక ఎండిపోయిన వరిని రైతన్నలు తగల పెడుతున్నారు. ఇప్పటికే వర్షాధారంగా సాగు చేసిన పంటలు దెబ్బ తినడంతో పాటు ఇప్పుడు వ్యవసాయ బోర్ల కింద సాగుచేసిన పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండడంతో బోరు బావులు పనిచేయని పరిస్థితి నెలకొంది. దీంతో బోర్ల కింద సాగుచేసిన మొక్కజొన్న, వరి ఇతర పంటల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.వందల అడుగు లోతుల్లో ఉన్న నీరు కూడా ఖాళీ కావడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పుడు ఏ వ్యవసాయ బోరు పనిచేయదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆయా గ్రామాలలో 60 శాతం పైగా వ్యవసాయ బోర్లు పని చేయకపోవడంతో పాటు మిగిలిన బోర్ల పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నాయి. మండలంలోని చింతలాయపల్లి, అబ్దుల్లాపురం,కోరుమానుపల్లి, మదనంతపురం, కొలిమిగుండ్ల తదితర గ్రామాల పరిధిలో వ్యవసాయ బోర్ల కింద రైతన్నలు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశారు. వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో బోరు బావులలో నీరు ఉండడంతో జులై నెలలో మొక్కజొన్నను సాగు చేయగా ఆగస్టు మొదటి వారంలో వరి నాట్లు వేశారు.అటు వర్షాలు కురవక ఇటు

భూగర్భ జలాలు అడుగంటడంతో పంటను కాపాడుకోలేని పరిస్థితి నెలకొంది. బోర్లు ఎండిపోవడంతోనీరు లేక రెండు నెలలు దాటిన మొక్కజొన్న, నెల కిందట సాగుచేసిన వరి ఎండిపోతున్నది. కంకి దశలో ఉన్న మొక్క పంట ఎండిపోతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కోరుమాని పల్లి గ్రామ పరిధిలో సాగుచేసిన వరి పంట ఎండిపోవడంతో సోమవారం రైతు చిన్న మాబు కాల్చి వేశాడు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలుఎండి పోవడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతన్నలనుప్రభుత్వంఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

ఈ మండలానికి ఏమైంది.. ఒకపక్క మురికి దుర్వాసన. మరోపక్క దోమలు పందులు

ఏ ఒక్కరు కాలు కదపరేంటి..మూల్యంగా ప్రజలకు జ్వరాలు

విశాలాంధ్ర-రుద్రవరం : ప్రభుత్వాలు స్వచ్ఛత కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటికీ కొన్ని గ్రామాలలో పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్న వైనం మనం చూస్తూనే ఉన్నాము. మురికి కుంటలలో ప్రజలు జీవిస్తూ అతిసారాకు గురై ఆసుపత్రులకు తిరుగుతూ చివరకు భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నారు. మండలంలోని కొండ మాయ పల్లి, నాగిరెడ్డిపల్లి, చందలూరు, తిమ్మనపల్లి, ముకుందాపురం, రుద్రవరం ఇలా అనేక గ్రామాలలో మురికి నీరు చేరి రోజురోజుకు రంగులు మారుతూ దుర్గంధం వెదజల్లుతూ మురికి కుంటలను తలపిస్తూ దోమలు చేరి రోగాల బారిన పడతా మేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొండమాయపల్లి లోని ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా ఉన్న దళిత కాలనీలో నీరు చేరి పారేందుకు వీలు లేక నీరు రంగులు మారుతూ దుర్గంధం వెదజల్లుతుంది. చందలూరు లోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న మంచినీటి ట్యాంక్ చుట్టూ నీరు చేరి రంగు మారుతూ దుర్వాసన వెదజల్లుతుంది. తిమ్మనపల్లి గ్రామంలో అప్పుడు మీరు పారిశుధ్యం పనులు చేశారా, ఇప్పుడు మేము చేయమంటూ భీష్మించుకూర్చున్నారు. దీంతో గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. మండలానికి చెందిన గ్రామాలలో ఈ విధంగా ఉంటే మండల కేంద్రంలోని

డొంక లో నిత్యం గ్రామస్తులు తిరుగుతూ రద్దీగా ఉండే ప్రాంతం. అక్కడే అధికారులు డ్రైనేజీ కోసం గుంతను తీసి మధ్యలోనే నిలిపివేశారు. ఇదే గుంతలో అనేకసార్లు వాహనదారులు పడటం జరిగింది. ఆ గుంతలోకి చేరిన నీరు రంగులు మారుతుండటమే కాక చివరకు అక్కడికి పందులు చేరి అక్కడే ఉన్న మురికిని తింటూ సంచరిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా నిత్యం దుర్గంధం వెదజల్లుతూనే ఉంటుంది. అదే దారిలో నిత్యం అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు ముక్కులు మూసుకుంటూ వస్తు పోతూ ఉంటారు కానీ ఇంతవరకు చర్యలు చేపట్టిన వారు లేరంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మండలానికి ఏమైందో తెలియదు గానీ మొత్తంగా పారిశుద్ధ్యం లోపిస్తూనే ఉంది. మొన్నటికి మొన్న పక్క మండలానికి అతిసార చేరి చివరకు అక్కడి ప్రజలు ప్రాణాలను పోగొట్టుకోవడం మనం చూసాము ,విన్నాము. ఇది కాస్త మన మండలానికి వ్యాపిస్తే ఇంకేమైనా ఉందా ప్రాణాలను భారీ మూల్యంగా చెల్లించాల్సి వస్తుందేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి మురికి కుంటలను తలపిస్తున్న నీరును తొలగించేందుకు చర్యలు తీసుకొని ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

నరకానికి నకళ్ళు..ఆ..రహదారులు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: గ్రామీణ రహదారులు నరకానికి నకళ్ళుగా మారాయి. సెప్టెంబర్ మొదటి వారంలో వారం రోజులపాటు విస్తారంగా భారీ వర్షాలు పడ్డాయి. రోడ్లపై రెండు నుండి 3 అడుగుల మేర గుంతలు ఏర్పడి తారంతా కొట్టుకుపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో పెద్ద యమ్మనూరు నుండి ఆర్.జంబులదిన్నె వరకు బోడెమ్మనూరు కుందూనది వంతెన నుండి జమ్మల మడుగు, కోవెల కుంట్ల ప్రధాన రహదారి వరకు నిర్మించిన బిటి రహదారి పూర్తిగా దెబ్బతింది. మండల కేంద్రం ఉయ్యాలవాడ నుండి దొర్నిపాడు మండలాన్ని కలుపుతూ 2016 -17లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 13.25 కిలోమీటర్ల దూరం పొడువున రూ.7.85 కోట్లతో రెండు మండలాలను కలుపుతూ రహదారిని నిర్మించారు. ప్రస్తుతం తారలేచిపోయి ఆరు కిలోమీటర్ల పొడవున రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రహదారిలో నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధించిన శాఖ అధికారులు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రోడ్డు పక్కన ఉన్న కంపచెట్లను తొలగించి రహదారులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థికి ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-పాములపాడు: పాములపాడు జి.సాయికృష్ణ, జి.లక్ష్మీదేవి ల కుమారుడు జి.మధు పవన్ కర్నూలు మెడికల్ కాలేజీలో గవర్నమెంట్ ఎంబిబిఎస్ సీటు సాధించినందుకు మధుకు సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ముందుగా జనసే పార్టీ నాయకుడు రాము, జాతీయ మాల మహానాడు రాయల సీమ అధ్యక్షుడు అంకన్న, సిపిఎం మండల నాయకులు సోమన్నలు శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి ఘనంగా సత్కరించారు.

పెద్దహొతురులో అలరించిన సప్తభజనలు

విశాలాంధ్ర-ఆలూరు : ఆలూరు మండల ప రిధిలోని పెద్దహొతురు గ్రామంలో వెలసిన అవదూత, తపోనిస్టు లు ఉచ్చిరప్ప తాత దేవాలయంలో 7 రోజులపాటు సప్త భజనలు అంగరంగ వైభవంగా జరిగాయి. సప్త భజనలు సందర్భంగా గ్రామంలోని అన్ని వర్గాల వారు. ఆలూరు మండల పరిధిలోని పెద్దహొతురు

గ్రామంలో వెలసిన తపోనిస్థులు ఉచీరప్ప తాత మఠంలో అఖండ సప్త భజనలు 10 వతేది నుంచి 17 వ తేదివరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. సప్త భజనలు సందర్భంగా మారకట్టు గ్రామంలో వెలసిన సలువప్ప, పెద్దహొతురు ఉచీరప్ప తాత లను గ్రామస్థులు పల్లకిలో ఊరేగిస్తూ ఆలయ నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరు పండుగ చేసుకోవడం అనవయితీగా వస్తుండటం విశేషం. ఏడు రోజులపాటు జరిగే సప్త భజనలలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేయడం, అనంతరం ఏడు రోజులపాటు ఉచిరప్ప తాత దేవాలయంలో గ్రామానికి చెందిన వివిధ కులస్థులు అన్నదానం చేయడం జరుగుతోందని గ్రామస్థులు తెలిపారు.

ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ్ర-బనగానపల్లె: మండల పరిధిలోని యాగంటి లో వెలిసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భముగా పల్లకి మహోత్సవం ఆలయ పండితులు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమములో పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్ నాయుడు

విశాలాంధ్ర-నందికొట్కూరు : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం సోషల్ మీడియా నందికొట్కూర్ నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గా పసుల శ్రీనివాస్ నాయుడు ను ఎంపిక చేసినట్లు సోమవారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పసుల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం జనరల్ సెక్రెటరీ జక్కుల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నందికొట్కూరు నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గా నన్ను ఎంపిక చేశారన్నారు.వాల్మీకి సంఘం నేతలు జక్కుల శ్రీనివాస్ రావు, డాక్టర్ విక్రమ్ నాయుడు, క్రాంతి నాయుడు బోయ, నంద్యాల జిల్లా కార్యదర్శి రామకృష్ణ నంద్యాల జిల్లా యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ బోయ దిలీప్ కుమార్ నాయుడు లకు కృతజ్ఞతలు తెలియజేశారు. వాల్మీకి జాతి బిడ్డగా,వాల్మీకి జాతి అభ్యుదయానికి పాటుపడతానని, వాల్మీకి జాతిని ఎస్టీ జాబితాలో చేర్చుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోరాడుతానన్నారు. వాల్మీకులలో ఐక్యత కోసం, చైతన్యం కోసం పని చేస్తానన్నారు.